(జ్యోతి మాసపత్రిక; జులై 1981)

మంచివాళ్ళు కూడా ఉంటారు

నాన్నగారు మా కంపెనీని పెంచిన విధానంలో, పోలీసు అధికారులతో నిత్యం సత్సంబంధాలు కలిగివుండడం ఒక అంశంగా పరిగణించి అనుసరిస్తూ వొచ్చారు. అంతేకాక, సుబ్బనర్సయ్యగారు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఇటీవల చేరిన సందర్భంగా జంటనగరాల్లోని కొందరు ముఖ్య పారిశ్రామిక వేత్తలు ఆయనకిస్తున్న ఈ విందులోనే సందుచూసుకుని నా పని ఒకటి ఆయనకి అప్పగించగలనని అనిపించింది.

అంచేత వెళ్ళాను, ఆ విందుకి.

"నమస్కారం సార్, నా పేరు లలిత" అన్నాను.

"నన్ను చెప్పనివ్వండి." అంటూ హైర్ల కంపెనీ రాజేశ్వరరావుగారు ముందుకొచ్చేరు "మిస్ లలితాంబ; ఎం.కాం; ఎమ్.బి.ఏ. జాల్ట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు—"

'నమస్కారం!' అన్నారు సుబ్బనర్సయ్యగారు. "జాల్ట్ కంపెనీయా? పేరేదో తమాషాగా వుందే! జోల్ట్ కాదుకదూ?

"పేరేకాదు," రాజేశ్వరరావుగారు మళ్ళా అందుకున్నారు. "ఆ కంపెనీ చరిత్రే ఒక తమాషా....లలితాంబగారు క్షమిస్తానంటే చెప్పేస్తాను" నేను చిరునవ్వుతో అంగీకారం ఇచ్చేపాటి వ్యవధిలో మళ్ళా— జాల్ట్‌కంపెనీ–అంటే **Z.A.L.T.** అన్నమాట. అనగా జింకు, అల్యూమినియం, సీసం, తగరం........ఈ నాలుగు లోహాలూ. వాటితో అవీ మిగతావాటితో అవీ కలిపి, ఎలెక్ట్రానిక్స్ నుంచి వంటపాత్రల వరకు రకరకాల సామగ్రి తయారు చెయ్యడానికుపయోగించే మిశ్రమాన్ని ఉత్పత్తి చేస్తారు వీరు. 1958లో వీరి తండ్రిగారు, ధన్వంతరిగారని, కేవలం ఇరవై వేల పెట్టుబడిలో స్థాపించిన ఈ కంపెనీ క్రమంగా లిమిటెడ్ కంపెనీ ఐ, ప్రస్తుతం ఏడాదికి రెండున్నరకోట్ల నికరాదాయంతో నడుస్తోంది. రెండేళ్ళ కిందట ధన్వంతరిగారు పోయినప్పట్నుంచి లలితాంబగారే జాల్ట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు. ఇదంతా మీకు తమాషాగా

కనిపించకపోవచ్చు. కాని ధన్వంతరిగారు ఎనిమిదేళ్ళనాడు అర్డర్ చేసిన జెకోస్లో వేకియన్ యంత్రాలు కొన్ని; ఆరేళ్ళకిందట్నుంచీ దరకాస్తు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ భారీరుణం: ఈవిడ ఎం.డి. అవగానే ఒకేసారి రావడం తమాషా. అప్పటికి ఈవిడకి గట్టిగా పాతికేళ్ళు వెళ్ళలేదు. అయితే ఆవిడలా కఠోర పరిశ్రమ చేసి కంపెనీని ఇంతలా వృద్ధిలోకి తేవడం తమాషాకాదు........ఒక్కటి చెబుతాను సుబ్బనర్సయ్యగారూ. ధన్వంతరిగారు ఆనాడు ఇక్కడ నేల చవగ్గా దొరికిందని కొనిపడేశాచు. కాని ఆయన కాలంలో అందులో పావుపంతుకూడా వినియోగించలేదు. ఇప్పుడు ఆ వందెకరాలూ చాలక; సరుకుల నిల్వకీ గోడౌన్లకీ స్థలాలకోసం వెతుకుతున్నారు. మాలాగా వ్యాపారవేత్తలమని చెప్పుకునేవాళ్ళకి, ఒక స్త్రీ నిర్వహణలో ఉన్న కంపెనీ ఇలా దినదినాభివృద్ధి చెందడం తమాషాగానే కనిపిస్తుంది" అని వీలయినంత తమాషాగా మాట్లాడుతూ రాజేశ్వరరావుగారు సుబ్బనర్సయ్యగార్ని అలా బాల్కనీ మీదికి నడిపించేశారు. ఇంకేముంది ....అక్కణ్నించి ఆయన టైర్ల ఫ్యాక్టరీ స్పష్టంగా కనబడుతుంది—ఏదో ఆయన సోది మొదలెడతాడు....

"తమరు నాకో చిన్న సాయం చేసిపెట్టాలిసార్" అన్నాను సుబ్బనర్సయ్యగారితో.

"చెప్పండి—"

"ఇన్నాళ్ళూ ఈ కంపెనీని ఆరుగురు కాపలా సిపాయిలలో నడిపించుకొచ్చాను. ముగ్గురు గూర్ఖాలుకూడా ఉన్నారనుకోండి....రెండు గేట్లు, ప్రహరీ గోడ. యంత్రాగారం—అన్నీ వాళ్ళే చూసుకుంటున్నారు. ఇప్పుడు కంపెనీ విస్తరణ దృష్ట్యా వీళ్ళు చాలరని ఇరవయి మంది సెక్యూరిటీ గార్డులతో, ఆరుగురు ఇన్‌స్పెక్టర్లతో ఒక సెక్యూరిటీ ఆఫీసర్‌తో ఆ శాఖని పటిష్టం చేయాలని నిర్ణయించాం. సరే, ఆఫీసర్ని ముందుగా నియమిస్తే మిగిలినవాళ్ళ నియామకంలో ఆయన సాయం వుంటుందికదా అని; సెక్యూరిటీ ఆఫీసర్ ఉద్యోగానికి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వేశాం. సుమారు నలభై వచ్చాయి....పోలీస్‌శాఖలో మీరు చేసిన అమూల్యమైనసేవ, సాధించిన అపూర్వ విజయాలు, మీకై మీరు నిర్మించుకున్న ఉత్తమ పాత్రతా గుణాలు విని, ఈ ఇంటర్వ్యూ మీరు నిర్వహిస్తే మా కంపెనీకి మేలని మేం భావిస్తున్నాం" అన్నాను.

"అంతేనా? మీ కంపెనీకి సెక్యూరిటీ ఆఫీసర్‌గా నన్నే రమ్మంటారేమోనని ఆశపడ్డాను!" అని నవ్వారు సుబ్బనర్సయ్యగారు.

"అదీ ఇదీ ఒకటే కదండి సార్" అన్నాను నవ్వి.

సుబ్బనర్సయ్యగారు కొంచెం ఆలోచించి, "అబ్బ! అబ్బ! పడగొట్టేశారు!" అన్నాడు.

o o o

సెక్యూరిటీ ఆఫీసర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి పిలవడానికి ఐదుగురు అభ్యర్థులను ఎంపిక చేశాం; నేనూ మా బోర్డాఫ్ డైరెక్టర్సూ కూర్చుని దరఖాస్తు లన్నీ పరిశీలించి,

నేనూ, సుబ్బనర్సయ్యగారూ; నా స్వంత నౌకరు కమల సాయంతో నా రూంలో ఇంటర్వ్యూ జరుపుతున్నాం.

ఒక్కొక్క అభ్యర్థి పంపిన 'బయోడేటా' కాగితాన్ని ఫైల్లోంచి ఊడదీసి సుబ్బనర్సయ్యగారికి ఇస్తోంది కమల. అది ఆయన చదివేక, తలుపు తెరిచి. ఆ పేరుగల అభ్యర్థిని లోపలికి పిలుస్తోంది,

వచ్చిన వ్యక్తి కాగితంలో రాయని వివరాలు; అంటే స్వంత వూరేది, తల్లిదండ్రులున్నారా, తండ్రిగారు ఏ వృత్తిలో ఉండేవారు? పెండ్లయిందా. పిల్లలున్నారా? మిగిలిన కుటుంబం ఎవరెవరు? ఇలాంటివి నేను ఆత్మీయంగా అడుగుతున్నాను.

సెక్యూరిటీ ఆఫీసర్‌గా తాను పనికొస్తానని అభ్యర్థి అనుకోడానికి కారణాలు; ఎలాంటి సందర్భాల్లో ఎలాంటి ప్రవర్తన నిర్ణయం అని తన అభిలాష, జీతం ఎంత కావాలి? జీపు కావాలా మోటార్ సైకిలా? ఫ్యాక్టరీ ఆవరణలో నివసిస్తారా, అద్దెయింట్లో ఉండదలచుకొన్నారా? ఇలాంటి ప్రశ్నలు సుబ్బనర్సయ్యగారు అడుగుతున్నారు.

ఈ ప్రశ్నలూ, ఆ ప్రశ్నలూ జమిలిగా వస్తున్నాయి. అభ్యర్థి కులాసాగా, అప్రమత్తంగా జవాబులు చెబుతున్నాడా అని నేను గమనిస్తున్నాను. అంతా రికార్డవుతోంది. మధ్యలో కమల లోపలి గదిలోకెళ్ళి సాఫ్ట్ డ్రింక్ తెచ్చి అభ్యర్థికి అందిస్తోంది. దానికి అతని ప్రవర్తన కూడా చూస్తున్నాను.

నలుగురైపోయారు. ఇంకొక్క అభ్యర్థి వున్నాడు. సుబ్బనర్సయ్యగారు ఏదైనా నిర్ణయానికి వచ్చారేమోనని చూశాను. ఆయన ఏమీ తేలలేదు.

ఐదో అభ్యర్థి 'బయొడేటా' కాగితాన్ని ఫైల్లోంచి ఊడదీసి సుబ్బనరసయ్యగారికి అందించింది కమల.

"మిస్ కమలా; నాకొక సిగరెట్ ప్యాకెట్ తెప్పించి పెట్టమ్మా" అన్నా రాయన కాగితం వైపు చూడకుండా, కమల వెనకగది గుండా వెళ్ళింది,

కాగితాన్ని అరనిమిషంలో చూసి, చదివి, తల అడించి, "లలితాంబ గారూ, ఈ అభ్యర్థిని మనం చూడక్కర్లేదు!" అన్నాడు సుబ్బనరసయ్యగారు.

"అదేం? మొదటి నలుగుర్లో వొకర్ని ఎంపిక చేసేశారా? అయినా ఇతన్ని పిలిచాం కదా" అన్నాను.

"అదికాదు—ఇతను రవివర్మ...."

"అవును!"

"ఐ. సి. యస్. కి సెలక్టయ్యాడు. కొంతకాలం ఒక స్టేషన్‌కి అధికారిగా ఉంటూ—"

"చూశా నందులో ఉంది...."

"శిక్షణకాలం పూర్తవకముందే రాజీనామా చేశాడు."

"అమాట కూడా రాశాడుగా"

"అలా ఎందుకు చేశాడో మీకు తెలుసా?" అన్నాడు సుబ్బనరసయ్యగారు; కుర్చీలో వెనక్కి చారబడి; కాళ్ళు టేబిల్ కానించి వెనక్కి వూగి.

"అందులో రాయలేదు...." అన్నాను; అయనేదో చెబుతాడని నాకు తెలిసీ కూడా ఆ సంగతి ఆయనకు స్ఫురించకుండాను.

"ఎందుకో నేను చెప్పగలను!"

నాకు ఇంతకుముందే తట్టింది. ఈయన హైదరాబాదుకి డిప్యూటీ ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుగా నెలరోజులకిందట వొచ్చే వరకు ఒక జిల్లాకి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా ఉండేవారు. బాహుశా రవివర్మ అనే అతను ఆ జిల్లాలోనే ట్రెయినింగ్ అవుతూ ఉండేవాడేమో! అటువంటప్పుడు అతను తన బంగారు భవిష్యత్తుకి నీళ్ళు వదులుకొని రాజీనామా చెయ్యడానికి ఈయనగారి ప్రోత్సాహమో. బలాత్కారమో ఉండకుండా ఎలా వుంటుంది?.... చూడనే అక్కర్లేదంటున్నాడు కనక ఈయనకీ అతనికీ కుదర్లేదన్న మాటే.

"నాకు తెలియనివి మీరు చెబుతారనేగా; మీ సహాయం కోరాను?" అన్నాను, "చెప్పండి. అత నెలాంటి వాడు?"

"ఒక్కమాటలో చెప్పాలంటే వాడొక బాధ్యతారహితుడైన బాలకుడు. లేకపోతే ఏమిటి, మేడమ్? ఛీఫ్ మినిస్టర్ ప్రోగ్రాం చేతుల్లో వుంచుకుని, మూడు రోజులపాటు పెలవూ దిబ్బా లేకండా ఓ అమ్మాయితో ఎక్కడికో షికార్లు చెలాయించి, సరిగ్గా ఆయన దిగిన రైల్లోనే ఆ అమ్మాయితో సహా దిగాడు. ఊళ్ళోను పరిసరాల్లోను ఛీఫ్ మినిస్టర్ ఉన్నారన్న ధ్యాసే లేకండా, ఆరోజూ మర్నాడూ కూడా డ్యూటీకి హాజరు కాలేదు. పైగా తను ఆ అమ్మాయిని ఫలానా చట్టం

ఫలానా శెక్షన్ కింద నేరం జరగకుండా రక్షించానంటూ రహస్యపు విన్నపం రాసి మద్రాసుకి తనకి ప్రయాణభత్యాల బిల్లు పెట్టి, ఆ అమ్మాయికి తిరుగు ప్రయాణానికి కూడా బిల్ పెట్టాడు. అలాంటి బోగస్ బిల్స్ ఓకే చెయ్యడానికి నేనేం కె. ఎల్. పతిని కాను, ఎం. ఎస్. నరసయ్యను!" అన్నారాయన గుండె మీద ఎడం చేతో తట్టుకుంటూ.

"కె. ఎల్ పతిగారెవరు? మీకంటె ముందుగా అక్కడ ఎస్. పి. చేశారా?"

సుబ్బనరసయ్యగారు బిగ్గరగా నవ్వారు. "ఎస్. యస్. మీ మోడెస్టీ కమెండబుల్‌గా వుంది. అంతేగాని మీకది తెలీదనుకోనేటంత అమాయకుణ్ని కాదు. అదేదో నానోటిమీదుగా చెప్పించాలని మీరు సూచించడంలో మీ హాస్య ప్రియత్వం వెల్లడవుతోంది— సరే— కె. ఎల్. పతి—కొండూరి లక్ష్మీపతి—అంటే జస్ట్ నోబడి—లేక ఒక ఆల్ టైమ్ ఫూల్."

నేను శాల్యూట్ చేసి "హాట్సాఫ్టుది జోక్" అన్నాను.

"సరే—అతను ఆ విధంగా డ్యూటీకి ఎగనామం పెట్టి తిరిగి డ్యూటీలో చేరాక, అతని ఇన్‌ఛార్జిలో వున్న ఆ స్టేషన్‌లో, మర్నాడు ప్రశ్నించడానికి ఉంచిన ఒక అనుమానితురాలిని, ఒక కాన్‌స్టేబుల్ రేప్ చేశాడు, దాని మీద పేపర్లలో పెద్ద గొడవ, అసెంబ్లీలో స్వల్పవ్యవధి ప్రశ్నలూ ఇవన్నీ మీరుఫాలో అయ్యేవుంటారు, దానికీ అతన్ని బాధ్యుడుగా చేశాం. ఎలా వుందంటారు— మన శిక్షాపద్ధతి?" అని, నేను ఆయన్ని మెచ్చుకోడానికి ఇంటర్ వెల్ ఇచ్చారు.

"బ్రహ్మభేద్యంగా వుంది?" అన్నాను. నా భావాలన్నీ దాచేసుకుంటూ.

"ఇడియట్— అడసిల్లని రక్షించానంటాడు! ఆ అమ్మాయి తప్పిపోయి నట్టు కంప్లెయింట్ లేదు.ఎఫ్. ఐ.ఆర్.అసలే లేదు. వాడి దగ్గరున్నదల్లా,మద్రాసు నుంచి ఎవడో సౌందరరాజన్ అనేవాడు, ఆ సోకాల్డ్ అమ్మాయి గార్డియన్ పేర రాసిన ఉత్తరం తాలూకు కాపీమాత్రం, దాంతో అతనేం సాధించగలడు? ఆటోమాటిక్‌గా కేసంతా అతనికి ఎదురు తిరిగింది. ఇక చేసేది లేక రాజీనామా ఇచ్చేడు."

"సరే అతన్ని ఇంటర్‌వ్యూకి రమ్మన్నాం. ఖర్చులిస్తున్నాం కనక ఓసారి చూసి మ పొమ్మందాం. ఏమంటారు?"

"అలా చెయ్యొచ్చు"

కమల సిగరెట్ పాకెట్‌తో వచ్చింది.

"సరే: ఈ అబద్ధపు పెళ్ళికి నా సాక్ష్యం కూడా ఎందుకు? పైగా ఇంత

అంపమైన శుభ్రమైన రూంలో పొగ పెట్టడం కూడా నాకు భావ్యం కాదు." అని సుబ్బనరసయ్యగారు లేచాడు. కమల అతన్ని లోపలి రూమ్‌లోకి తీసుకెళ్ళింది,

నేను బయటహాల్లో మోగే బజర్ నొక్కాను. అప్పారావు వచ్చేడు. "రవివర్మ గారుట. ఇంటర్‌వ్యూ కొచ్చారు. లోపలికి పంపించు" అన్నాను,

ం ం ం ం

"ప్లీజ్ కమిన్" అన్నాను.

ఆరడుగులు పొడుగున్నాడు. తెల్లటి పంట్లాంలో తెల్లటిఫుల్ చేతుల చొక్కా టక్ చేసుకున్నాడు, గోధుమరంగు శరీరం. మొహం చాలా పెద్దది, మీసాలు ఒత్తుగా వున్నాయి. కళ్ళుచాలా చిన్నవి, వీపు వెనకాతల బల్ల చెక్క కట్టినట్టు నిటారుగా నడుచుకుంటూ వచ్చేడు.

ఒకచేత్తో శాల్యూట్ చేశాడు.

"కూర్చోండి"

"థాంక్యూ మేడమ్"

మామూలు పద్ధతిలో, ఒకప్రశ్న వ్యక్తిగత వివరాలమీద, తరవాతది డ్యూటీ గురించి అడుగుతూ, ఒకనిమిషం అతన్ని పరిశీలించాను—మాట స్పష్టంగా వుంది. చూపు ఖాళీగావుంది,

"మీరు ఐ. పి. ఎస్.కి సెలెక్టయి. అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తూకూడా, కనుచూపు మేరలో మంచి భవిష్యత్తు, అధికారం కనబడుతూ కూడా ఎందుకు రాజీనామా చెయ్యవల సొచ్చిందో అడగొచ్చా?" అన్నాను.

"మీ కంపెనీలో సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టుకి నా అర్హతలు పరిశీలిద్దామని నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నారు. అంచేత మీరు ఏ ప్రశ్న అయినా అడగొచ్చు నన్ను. కానీ, జవాబులు చెప్పాలనిపించకపోతే కొన్ని ప్రశ్నలకి, నేను చెప్పకపోవచ్చు. దానికి మీరేమీ అనుకోరని ఆశిస్తాను."

నేను చిరునవ్వు నవ్వాను. "మీరిక్కడ నియమించబడితే మీ ఉద్యోగ బాధ్యతల సంగతి అలావుంచి, మీరు మా ఆప్తుల్లో, కుటుంబ సభ్యుల్లో వొకరుగా పరిగణించబడతారు. అలాంటప్పుడు మనమధ్య, జవాబులు చెప్పకూడని ప్రశ్నలంటూ ఉండకూడదుకదా."

అతను కళ్ళు సన్నగాచేసి నవ్వాడు. "చాలా సంతోషం మేడమ్. మీరు మీ కంపెనీ ఉద్యోగులపట్ల చూపే అభిమాన విధానం తెలుసుకొన్నందుకు చాలా సంతోషంగా వుంది——"

ఒక అరనిమిషం అతని కాగితాలు చూస్తూ నిశ్శబ్దంగా ఊరుకున్నాను.

"ఇంకేమైనా అడుగుతారా మేడమ్?" అని లేచాడతను.

నాన్నగారు పోయాక జాల్ట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టరుగా ఈ కుర్చీలో కూర్చుని వివిధ ఉద్యోగాలకు వందల మందిని ఇంటర్వ్యూ చేశాను.

"ఇహ మీరు వెళ్ళొచ్చు" అని నేననడమే గాని—

"దయచేసి కూర్చోండి. టీ తీసుకెళుదురుగాని— నో. ఎక్కువ సేపు పట్టదు." లోపలి గదిలో మోగే బజర్ నొక్కాను, 'ఆఫ్‌కోర్స్ మిమ్మల్ని చాలాసేపు బయట కూర్చోపెట్టాను. అయినా—' చిరు నవ్వు నవ్వాను. 'మీరంత తొందర పనిలో ఉన్నారని నేననుకోవడంలేదు." అన్నాను.

ఖర్చులు పుచ్చుకొని ఇంటర్వ్యూకొచ్చి, నేను పొమ్మనకుండా తనే వెళతానంటాడా, అన్నకసి ఆ మాటతో కొంత తీరింది.

'థాంక్యూ మేడమ్' అని కూర్చున్నాడు తను, కనపడీ కనపడని చిరు నవ్వు మొహాన పూసుకుని.

ఒక్క నిమిషం గడిచేలోగా కమల లోపలి గదిలోంచి వస్తున్నట్టు అధునాతనమైన తలుపుగడియ చేసిన మృదువైన చప్పుడు. ఆ వెనకే కమల టీకప్పులతో తెచ్చిన ట్రేని దూరంగా టీపాయ్ మీద పెట్టి, వినయం, నైపుణ్యం, పరిశుభ్రం ఉట్టిపడేట్టుగా, కప్పులు సాసర్లలో టేబిల్ మీదున్న రబ్బరు పలకల మీద పెట్టింది.

"టీ తీసుకోండి" అన్నాను, నా కప్పు అందుకుంటూ.

అతను కప్పు అందుకొంటూ కమల వేపు చూశాడు "బాగున్నావా, డియర్ లోటస్?" అన్నాడతను వోగుక్కపీల్చి.

"మరేండీ" అంది కమల అతన్ని ఖాళీగా చూస్తూ.

"మా కమల మీకు తెలుసా?"

"ఔను మేడమ్. తనపేరు 'కమల'—కాదు 'కమలం' అనినాకు జ్ఞాపకం. కాని ఆమె నన్ను మరచిపోయినట్టుంది. అంచేత, అదే— తను నన్ను మరిచి పోడమే తనకి ఆరోగ్యం—అంచేత—" చిరునవ్వు నవ్వాడు "ఆ ప్రశ్నకి కూడా నేను సమాధానం చెప్పడంలేదు." అని లేచాడు రవివర్మ. "థాంక్యూ మేడమ్" అని, ఒకసారి 'బౌ' చేసి వెళ్ళిపోయాడతను,

ం ం ం

ఆరాత్రి నాకు భోజనం పెట్టడానికిగాని పళ్ళరసం అందించడానికి గాని కమల నా గదికి రాలేదు.

ఏ మొహం పెట్టుకు వస్తుంది?

సుబ్బనరసయ్యగారు చెప్పిన కథలో అమ్మాయి కమలేనని స్పష్టమై పోయింది.

సరిగ్గా ఏడాదికిందట–

అల్యూమినియం శ్క్రాప్ కొనడం విషయంలో కాంట్రాక్ట్ సంతకం చెయ్యడానికి రాజమండ్రి క్యాంప్ వెళ్ళాను.

అక్కడికి వచ్చాడు; కమలని తీసుకుని. ఆమెని పన్నెండేళ్ళ పాటు పెంచిన వాళ్ళ చిన్నాన్న కరుణాకరంగారు. ఆయన ఒకప్పుడు నాన్నగారి దగ్గర పి.ఏ.గా ఉండేవాడు. 'దీన్నినే నిన్నాళ్ళూ నా పిల్లలతో సమంగా పెంచాను. పి.యు.సి. పాస్ చేయించాను. టైపూ షార్ట్‌హాండూ నేర్పించాను. ఏదైనా ఉద్యోగంలో పడేస్తే కట్నాలూ కానుకలూ లేకండా ఎవడో పెళ్ళాడొచ్చని ఐడియా. కాని నా పలుకుబడితో మావూళ్ళో దీనికి ఉద్యోగం రావడంలేదు. పైగా నా కూతురూ కొడుకూ కూడా ఎదిగి పెళ్ళికీ ఉత్యోగానికీ ఉన్నారు. ఈ సమయంలో వాళ్ళని వెనకపెట్టి దీని సంగతిచూడ్డం ఇంట్లోనూ ఊళ్ళోనూ కూడా కంటకం అవుతోంది....అంచేత నీకంపెనీలో దీనికేదో చిన్న వుద్యోగం యిచ్చి పుణ్యంకట్టుకో అమ్మా' అన్నాడు కరుణాకరంగారు, కమలని నాకు అప్పగించి. 'నువ్వు దీనికి క్లర్కు. టైపిస్టు, టైనో ఇలాంటి పన్లేం యివ్వక్కర్లేదు. ఇంటిపనికో వంటపనికో పెట్టుకున్నా చేస్తుంది....ఏమ్మా?' అన్నాడు. కమల సరేనని తలవూపింది. ఆ విధంగా కమలని నా దగ్గర స్వంత నౌకరుగా కుదుర్చుకున్నాను–

ఈ ఏడాది పాటూ ఎక్కడా గోరెత్తి చూపించగల తప్పు చెయ్యకుండా నా వేళలూ అవసరాలూ అభిరుచులూ కనిపెట్టి పని చేస్తూంది....

'బుద్ధొచ్చుంటుంది.........'

మళ్ళీ యివాళ రవివర్మని చూసింది....అతనికి నేను ఉద్యోగం యివ్వ బోడంలేదని దానికి తెలీదు. తెలిశాక, అతనిమీద సానుభూతితో అతని సామీప్యం పోయిందని నా పన్లమీద ఆలక్ష్యం పెంచుకుంటే నాకాసంగతి నిః షాలమీద తెలిసిపోతుంది. ఈ మాత్రం వుద్యోగం, ఇంతరక్షణ. దానికి దొరకడం అసాధ్యం. ఈ యింట్లో ఇలాంటి నౌకర్లు కొందరు ఇప్పటికే మారేరు. ఇదిపోతే నాకు ఇలాంటిదో దీని బాబులాంటిదో మరొకర్తి వస్తుంది.

అయినా సరే, ఈ క్షణంలో కమల ఏమనుకుంటూందో నాకు తెలియాలి.........ఒక్కసారి రవివర్మ మొహం కనబడగానే నన్ను మరిచి

పోయింది....'కమలం'ట, దీని అసలుపేరు!—నాకన్నా వాడికే ఎక్కువ తెలుసు!—ఎక్కడేడుస్తోందో?—ఏడుస్తోందా?

మేడమీది నా గదిలోంచి బయలుదేరి, కిందని వంటగదికి ఆనుకొని వున్న కమల గదికి వెళ్ళాను.,. తలుపు తీసేవుంది.

లైటు ఆర్పేసివుంది. ఫాన్ తిరగటంలేదు.

"కమలా!"

జవాబులేదు.

లోపలికెళ్ళి స్విచ్ వేశాను. లైటు వెలిగింది.

"ఏంటమ్మగారూ?" నా వెనకనుంచి పిలుపు....

వంటావిడ.

ఇటుతిరిగాను.

"కమలేది?"

"ఇప్పుడే అట్లా వెళ్ళిందమ్మా."

హాల్లోకొచ్చి చౌకీదార్ కోసం బెల్ స్విచ్ నొక్కాను. ఒక నిమిషంలో వాడి పెళ్ళాం పరుగెత్తుకొచ్చింది.

"కమలేది?"

"ఆఫీసు కెళ్ళిందమ్మా. ఏవో అర్జంటు కాయితాలు కావాలటగా! ఇంతకు ముందే వెళ్ళింది."

"కారు తీసికెళ్ళిందా?"

లేదని నాకు తెలుసు, డ్రయివరు ఎనిమిది గంటలకే తాళాలు నాకిచ్చి వెళ్ళిపోయాడు.

"లేదమ్మా. నడిచే వెళ్ళింది."

"సరే"

నా వేషం చూసుకున్నాను. బాగానే వుంది. మార్చక్కర్లేదు. గబగబా మేడమీదికెళ్ళి తాళాలు తీసుకున్నాను.

నిజంగా ఆఫీస్ కే వెళ్ళుంటుందా?....

అతను తన అడ్రస్ ఇచ్చివుంటాడేమో. అక్కడికి పోయిందేమో, భ్రష్ట!........

అతనూ కమలా ఇవాళ మళ్లా ఎక్కడ కలుసుకొని వుంటారు? ఫలానా చోట కలుసుకుందాం అని అనుకోడానికి ఇంటర్వ్యూ అయిపోయాక ఎక్కడో కలుసుకోవాలి కదా....అతగాడు ఇంటర్వ్యూ అవగానే టీ తాగి వెళ్ళాడు.... తరవాత? ఈ కమల నాతోనే ఉందికదా!

మెట్లుదిగి కమల రూం వేపు చూశాను. నేను వేసిన లైటు ఇంకా వెలుగుతూనే వుంది. ఆ లైటు ఆర్పడం అవసరంలా నా కాళ్ళు అటు దారి తీశాయి....కొంపదీసి ఈ జెష్ట ఏదైనా అఘాయిత్యం తలపెట్టలేదు కదా—!

అక్కడ, కమల ఉపయోగించే చిన్న టేబిల్ మీద ఒక కాగితం ఉంది!....అమ్మా. అమ్మా!—ఎగిరిపోకుండా కప్పతాళం వుంచింది.

“అమ్మగారికి, నమస్కారం!

“మీరు డి.ఐ.జి.గారిని సాగనంపడానికి వెళ్ళినప్పుడు టేపు రికార్డర్ విన్నాను. రవివర్మగార్ని డి.ఐ.జి.గారు అప్పుడు అనుమానించేరు. ఇప్పుడు అవమానించేరు—

మీకు నిజం తెలిసే అవకాశంలేదు. మీరెంతో గొప్పమనసు కలవారు, అయినా ఒక కన్నెపిల్ల ఒక దుష్టుడి చేతుల్లో మోసపోతూవుంటే సకాలంలో ఆమెని రక్షించి ఇల్లుచేర్చి అందుకు ఫలితంగా తన గొప్ప ఉద్యోగాన్ని పోగొట్టుకున్న ఒక సన్మార్గుడిని తెలుసుకోలేకపోయారు——

ఆనాడు మద్రాస్ మెయిల్లో సౌందరరాజన్‌గారు, నన్ను సినిమాల్లో జేర్పిస్తానని (అన్నెల్లపాటు ఊదరగొట్టి) మాయ మాటలతో మద్రాస్ ప్రయాణం కట్టించిన జయకరరావును భయపెట్టి తన యింటికి తీసుకువెళ్ళి సురక్షితంగా కాపాడారు—నన్ను తీసుకు వెళ్ళవలసిందని బాబాయిగారికి వ్రాస్తే రాలేదు: సరికదా, జవాబులేదు.

అప్పుడు రవివర్మగారు, సౌందరరాజన్‌గారు బాబాయిగారికి రాసిన ఉత్తరం కాపీ సహాయంతో—స్వంత ఖర్చులమీద మద్రాసు వచ్చి నన్ను తిరిగి తీసుకువెళ్ళి భద్రంగా బాబాయిగారికి వొప్పగించారు. అతను రక్షకుడు, కాని ఆనాడు బాబాయిగారు పిన్నిగారు అన్నమాటలే పోలీసు అధికారులు అన్నారు; అంటున్నారు.

రవివర్మగారు, తన ఉద్యోగం పోకుండా ఉండేటందుకు, నేను ఐదు రోజులపాటు కనిపించలేదని, ఫలాని వ్యక్తిమీద అనుమానం అని రిపోర్టు ఇమ్మని బాబాయిగార్ని ఎన్నో విధాల అడిగారు. రిపోర్టు ఇస్తె పరువు ప్రతిష్టలకు భంగం అనీ, పోలీస్ విచారణల బాధపడలేం అనీ బాబాయిగారు తప్పించుకున్నారు. నేను చెడిపోయానని బంధువుల్లో తామే ప్రచారంచేసి నన్ను మీకు వొప్పగించారు.

విజయవాడ స్టేషన్‌లో సౌందరరాజన్‌గారు మా కంపార్టుమెంటులో ఎక్కడంనుంచి, మీరు ఏడాదికిందట రాజమండ్రి క్యాంపు రావడం వరకు అన్నీ నాకు అదృష్ట సంఘటనలే. శుభాలే.

రవివర్మగారు నన్ను ఆ విధంగా మద్రాసునుంచి తిరిగి తీసుకురాక

పోయివుంటే, సౌందరరాజన్‌గారు నన్ను——సినిమా కంపెనీలకంటె అధమ స్థితిలో వున్న అనాథ శరణాలయం దేంట్లోనో వప్పగించి ఉండేవారు——

రవివర్మగారు ఏతప్పూ చెయ్యకనే శాపంపొందిన దేవుడు. నా మూలంగా ఆయన రెండుసార్లు ఉద్యోగానికి దూరమైనారు.

మీకూ, డి.ఐ.జి.గారికీ రవివర్మగార్ని గురించి జరిగిన సంభాషణ టేప్ ద్వారా విని చాలా దుఃఖపడ్డాను——కాని ఆయనకు నేనే క్షమాపణ చెప్పుకోవాలని అనిపించింది——నా అదృష్టవశాత్తు ఆయన, తనకి కంపెనీ నుంచి రావలసిన ప్రయాణపు ఖర్చులు రాబట్టుకోడానికని ఎకవుంట్ సెక్షన్‌లో వున్నారు. అక్కడ నా ఏడ్పు ఆయనకు వినిపించలేక, రాత్రి ఆఫీస్‌వద్దకు రమ్మన్నాను.

నేనుగాని రవివర్మగారుగాని ఏ తప్పూ చేయలేదు. అయినా మీరు నన్ను ఏమీ అడగరు. డి.ఐ.జి.గారు పెద్దమనిషి. ఆయన చెప్పిన మాటతే నమ్ముతారు. నన్ను మీరు గౌరవంగానే చూస్తారు. కాని నేను చెడిపోయాననే భావిస్తారు. ఆ భావం మీలో ఉన్నంత కాలం మీ దగ్గర నేను మనలేను.

కనుక నాకు సెలవిప్పించమని కోరుతున్నాను——

*　　*　　*

ఆఫీస్ గేటు దగ్గిర బిత్తరచూపులు చూస్తూ నిలుచుంది కమల. కారు హెడ్‌లైట్లు ఆఫ్‌చేసి, కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా వున్నాను. ఏ టాక్సీలోనో, అతనేవచ్చాడనుకుందో ఏమో, పరుగెత్తు కొచ్చింది.

"అతనింకా రాలేదా?" కిటికీలోంచి తల బైటపెట్టి అడిగాను.

భయంతో వెనక్కి జరిగింది కమల.

కారు దిగాను.

దగ్గిరగా వెళ్ళి కమలని కావిలించుకున్నాను. "నువ్వు నా గదికి రాలేదు. భోజనం పెట్టలేదు. పళ్ళరసం యివ్వలేదు. నాకు నిద్రెలా పడుతుందనుకున్నావు కమలా?——పోనీలే——ఉత్తరం రాసి పెట్టావు. లేకపోతే నాకెప్పుడు తెలుస్తుంది. ఎలా తెలుస్తుంది——"

అలా ఏదో మాట్లాడసాగాను.

నా ఉద్దేశం "నీ కథంతా నమ్మాను. నిన్ను క్షమిస్తున్నాను. అదే, ఇవాళంతా నాకు దూరంగా వున్నందుకు. అతను ఒక్కసారే ఉద్యోగానికి దూరమయ్యాడు" అలా ఏదో చెబుదామని.

కాని, నేను అనబోయిన మాటలే తనకి వినిపించినట్టు——

"కమలని కమలం" కౌగిట్లోంచి కాళ్ళమీదికి జారింది.